


## ది లవ్ జర్మ్

*A NOVEL IS A CHILD IN THE ARMS OF A STORY.*

**నవల అంటే కొన్ని కథల మిశ్రమం.** లేదా పెంచబడ్డ ఓ కథ!కథ పరిధి ఒకే చట్రంలో ఉంటే, నవల పరిధి విస్తృతంగా ఉంటుంది. కథకి అవసరం లేని అనేక విషయాలని సందర్భోచితంగా నవల్లో చొప్పించవచ్చు. ఇది చాకచక్యంగా చేయకపోతే అతకదు. దాంతో పాఠకులకి అసందర్భం అనిపిస్తుంది. నా నవలలు లావణ్య, మిసెస్.పరాంకుశం ప్రచురించాక ఎమెస్కో సంస్థ ఎం.ఎన్.రావుగారు మరో నవల అడిగారు.

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో, 25-1-1974 సంచికలో వచ్చిన నేను రాసిన కథ ది లవ్ జెర్మ్‌లో నవల రాయదగ్గంత నాటకీయత, పరిధి ఉండటంతో దాన్ని నవలగా పెంచి రాస్తే అభ్యంతరం లేదు కదా అని అడిగాను. లేదని, కాకపోతే నవల నచ్చితేనే వేస్తామని ఆయన చెప్పారు. దాంతో ఆంధ్రపత్రికలోనే వచ్చిన మరో రెండు కథలు ఔన్నత్యం (29-6-1973) బాక్స్ నంబర్ 0808 (24-8-1973) ఈ మూడిటినీ కలిపి డైరెక్ట్ నవలగా రాసాను. ప్రధాన కథ ది లవ్ జెర్మ్. ఈ కథల్లోని పాత్రలని, సన్నివేశాలని యధాతథంగా తీసుకుని, ఆ పాత్రల మధ్య కొత్త సంబంధ బాంధవ్యాలని సృష్టించి ఈ నవలని రాసాను. ఆ కథల్లో లేని రెండు కొత్త పాత్రలని కూడా సృష్టించాను. అవి శేషమాంబ, ఫల్గుణి. నవంబర్ 1977లో నేను చేసిన ఈ ప్రక్రియ తాలుకు వివరణతో ది లవ్ జెర్మ్‌ని ఎమెస్కో వారు ప్రచురించారు. ది లవ్ జెర్మ్ అంటే ప్రేమ క్రిమి అని అర్థం. గుప్త వ్యాధులకి చెందిన ఓ వ్యాసాన్ని కేరవాన్ అనే ఆంగ్లపత్రికలో అనుకుంటా నేను చదివాను. అందులో ఆ వ్యాధి కారక క్రిమిని లవ్ జెర్మ్‌గా పేర్కొన్నారు. ఆ వ్యాధి వ్యాపించే పద్ధతులని కూడా వివరించారు. ఆ వ్యాధిగ్రస్థుడి రక్తం ఆరోగ్యవంతుడి శరీరంలోకి ఎక్కిస్తే ఆ సుఖ వ్యాధి ఆరోగ్యవంతుడికి కూడా వ్యాపిస్తుంది అని అందులో రాసారు. భార్య భర్తల మధ్య ఇలాంటిది జరిగితే పొరపొచ్చాలు వచ్చే అవకాశం ఉంటుందని రాసిన కథ ది లవ్ జెర్మ్‌ని ఆనాటి ఆంధ్ర పత్రిక ఎడిటర్ శ్రీ వీరాజీ అంగీకరించి ప్రచురించారు. ఆ కథావస్తువుని నవల ఇతివృత్తంగా తీసుకుని ది లవ్ జెర్మ్ పేరుతోనే రాసాను.

పెళ్ళయ్యాక హీరో భరద్వాజ తన భార్య తులసితో లండన్ వెళతాడు. కథాస్థలం లండన్ గురించి రాయాలి కదా? ఆదివారాలు అబిడ్స్ పేవ్‌మెంట్స్ రచయితగా నాకు బంగారు గని. ప్రతీ ఆదివారం అక్కడికి వెళ్ళి నాకు నచ్చే పుస్తకాలని వెదికి కొనేవాడ్ని. ఓసారి లండన్ నగరానికి వచ్చే యాత్రికుల కోసం వెలువరించిన 'విజిట్ లండన్' అనే ఇంగ్లీష్ పుస్తకాన్ని అక్కడ కొన్నాను. అందులో లండన్

నగరం మేప్, నంబర్లతో సహా బస్, ట్యూబ్, ట్రామ్ రూట్స్, ఇతర వివరాలు సమగ్రంగా ఇవ్వబడ్డాయి. అది దగ్గరుంచుకుని భరద్వాజ తన భార్య తులసికి లండన్ నగరం చూపించడం రాసాను.

బ్రిటిష్ రాజులకి పట్టాభిషేకం జరిగే వెస్ట్‌మినిస్టర్స్ ఎబే, విండర్స్ కేజిల్, పికడెల్లీ సర్కస్, జ్యూవెల్ టవర్, మార్ల్‌బరో హౌస్, లంకాస్టర్ హౌస్, సెయింట్ జేమ్స్ పేలస్, ఓల్డ్ క్యూరియాసిటి హౌస్, సెయింట్ జేమ్స్ పేలస్, ఓల్డ్ క్యూరియాసిటి హౌస్, పూలు, కూరలు, పళ్ళు అమ్మే కోవెంట్ గార్డెన్ మొదలైనవి చూపిస్తాడు. హైడ్ పార్క్ మొదలైన ప్రదేశాల గురించి కూడా రాసాను. హైడ్ పార్క్‌లో ఓ చోట స్టేజీ మీదకి ఎవరైనా వెళ్ళి ఏ టాపిక్ అయినా మాట్లాడచ్చని రీడర్స్ డైజెస్ట్‌లోని ఓ ఆర్టికల్‌లో చదివాను. భరద్వాజ స్టేజీ ఎక్కి తన భార్యా పిల్లల్ని తనెంతగా ప్రేమిస్తున్నాడో చెప్తాడు. కానీ ఇప్పుడైతే భరద్వాజ తను ఉల్లిపాయనెంత ఇష్టపడతాడో మాట్లాడి తులసిని, శ్రోతలని నవ్వించినట్లుగా రాసేవాడిని అనిపించింది.

బస్ రూట్ నంబర్లు, దూరం మొదలైనవి వివరంగా రాయడంతో చాలామంది పాఠకులు నేను లండన్ నగరం చూసి వచ్చానని భ్రమించారు కూడా. ఆ నవల రాసిన పన్నెండు సంవత్సరాలకి కానీ నేను లండన్ వెళ్ళలేదు. విజిట్ లండన్ పుస్తకంలో ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్‌లోని వీరాస్వామీస్ సౌత్ ఇండియన్ రెస్టారెంట్ ప్రకటన ఉంది. ఆ రెస్టరెంట్‌కి భరద్వాజ, తులసి వెళ్ళినట్లు రాసాను.

1989లో నేను మొదటిసారి లండన్ వెళ్ళినప్పుడు వెదుక్కుని ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్‌లోని ఆ తమిళియన్ రెస్టరెంట్‌కి వెళ్ళాను. అదింకా ఉంది. పాశ్చాత్య దేశాల్లో మన దేశంలో లాగా రెస్టరెంట్‌లోకి చొరపడి ఎక్కడ పడితే అక్కడ కూర్చోకూడదు. హోస్టస్ తీసుకెళ్ళి కూర్చోపెట్టిన చోటే కూర్చోవాలి. హోస్టస్ నన్ను తీసుకెళ్ళి ఓ చోట కూర్చోపెట్టబోయింది. తర్వాత ఆర్డర్ అడుగుతుంది. కానీ నా దగ్గర ఆ ఖరీదైన రెస్టరెంట్లో భోజనం చేసేంత డబ్బులేదు. అందుకని నా మిత్రులు నన్నక్కడ కలవమన్నారని, వాళ్ళు ఉన్నారేమో చూస్తానని, ఓ అబద్ధం ఆడి దాదాపు వంద సీట్లు గల ఆ రెస్టరెంట్‌ని చూసి బయటపడ్డాను.

బ్రిటిష్ ఇంగ్లీష్‌కి, అమెరికన్ ఇంగ్లీష్‌కి ఉచ్చారణలోనే కాక పదాల్లో కూడా తేడా ఉంది. బ్రిటిష్ వారు 'పంచర్' అయిందంటే అమెరికన్స్ 'ఫ్లాట్' అయింది అంటారు. బ్రిటిషర్స్ 'లిఫ్ట్' అంటే అమెరికన్స్ 'ఎలివేటర్' అంటారు. ఈ తేడాలని అందులో రాసాను.

కొంతకాలానికి గర్భవతి అయ్యాక ఆమె కానుపుకి లండన్ నుంచి పుట్టింటికి వస్తుంది. డెలివరీ అయ్యాక జరిగిన చిన్న ప్రమాదంలో తులసికి రక్తం ఎక్కిస్తారు. అది గనేరియా వ్యాధిగ్రస్తుడి రక్తం. ఇది రాయడానికి మళ్ళీ ఈ నవల చదువుతూంటే, డెలివరీ సమయంలో రక్తం ఎక్కించినట్లుగా రాయాల్సింది అనిపించింది. అది ప్రమాదం కన్న సహజంగా ఉండేది.

ఇండియా నుంచి తిరిగి తులసి లండన్ వెళ్ళాక ఆ వ్యాధి భర్తకి కూడా అంటుకుంటుంది. ఆమె శీలాన్ని అనుమానించి తిరిగి ఇండియాకి తీసుకొస్తాడు. చివరికి అపార్థాలు తొలిగి ఆ వ్యాధిగ్రస్తుడి రక్తం ఎక్కించడం వల్ల అది వచ్చిందని తెలుస్తుంది. అప్పట్లో నేను ఆర్నెల్లకోసారి రక్తదానం చేసేవాడిని. అందువల్ల బ్లడ్ గ్రూప్స్ వివరాలు తెలుసు. కాబట్టి తులసి బ్లడ్ గ్రూప్ ఏ.బి పాజిటివ్‌గా రాసాను.

ఓసారి పెట్టిన పేరు మళ్ళీ పెట్టను కాబట్టి సదా కొత్త పేర్ల కోసం అన్వేషిస్తూండేవాడిని. కథాకాలంలో జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టి తులసి అన్నయ్య పేరు ఇంకా నేను వాడని వెంగళరావు అని పెట్టాను. ఇటీవల నేను చతుర మాసపత్రికలో సీరియల్‌గా రాసిన మిస్టర్ మిరియంలో పొరపాట్న మళ్ళీ ఓ పాత్రకి ఈ పేరు వాడాను.

1970లో హైదరాబాద్ లోని పెంగ్విన్ టెక్స్‌టైల్స్ లో నేను అసిస్టెంట్ అకౌంటెంట్‌గా పని చేసేప్పుడు ఓ పొరపాటు చేసాను. కవర్ల మీద ముందు అడ్రస్‌లు రాసి, తర్వాత కవరింగ్ లెటర్ గల చెక్‌లని వాటిలో ఉంచేవాడిని. తర్వాత వాటిని అతికించి పోస్ట్ చేయడానికి ప్యూన్‌కి ఇచ్చేవాడిని. ఓసారి ఒకరి చెక్‌ని మరొకరి కవర్లో పొరపాటున ఉంచి పోస్ట్ చేయడంతో ఇద్దరి నుంచి అవి తిరిగి వచ్చాయి. ఆ తర్వాత అడ్రస్ రాసిన కవర్లో దానికి సంబంధించిన చెక్‌ని పెట్టాకే మళ్ళీ కొత్త చెక్ తీసుకుని కవర్ మీద అడ్రస్ రాయడం

చేసేవాడిని. వెంగళ్రావు ఉద్యోగం పోవాల్సిన సందర్భంలో ఈ అనుభవాన్ని, ఇంక బాక్స్ నెంబర్ 0808 కథలోని సంఘటనని నవల్లో వాడాను. తన క్వాలిఫికేషన్స్ సరిపోవడంతో వెంగళ్రావు ఓ బాక్స్ నెంబర్‌కి ఉద్యోగానికి అప్లై చేస్తాడు. అయితే తను పని చేసే కంపెనీ వాళ్ళే ఆ ప్రకటన ఇచ్చారని అతనికి తెలీదు. అతనికి ఉద్యోగం మారే ఉద్దేశం ఉందని తెలియడం వల్ల, చేసిన ఈ తప్పు వల్ల ఉద్యోగం పోతుంది.

ఔన్నత్యం కథలో చెల్లెలి పెళ్ళిచేయడానికి అక్క భ్రమరాంబ త్యాగం చేస్తుంది. అందవిహీనమైన భ్రమరాంబ, ఆనాటి సామజిక పరిస్థితులని బట్టి తను అవివాహిత అని చెపితే చెల్లెలికి పెళ్ళి కాదని, తను విధవరాలు అని అబద్ధమాడి చెల్లెలు తులసికి భరద్వాజతో పెళ్ళి చేస్తుంది. ఆ కథని యధాతథంగా నవల్లో వాడాను.

మళ్ళీ ఈ నవల చదివితే ఎక్కడా మూడు వేరే వేరే కథలు కలిపి రాసిన భావన నాకే రాలేదు. అల్లిక కరెక్ట్‌గా కుదిరింది.

డిసెంబర్ 1987లో గుంటూరులోని శ్రీ శ్రీనివాస పబ్లిషర్స్ హౌస్ సంస్థ అధినేత శ్రీ జి.వి.సుబ్బయ్య లావణ్య, ది లవ్ జర్మ్ నవలలని కలిపి ఓ పుస్తకంగా ప్రచురించారు. అప్పటి వెల రూ20/ అచ్చులో 128 పేజీలు వచ్చింది.

●●●

**సన్నివేశం:-**

*"యువర్ ఎటెన్షన్ ప్లీజ్. ది లండన్ - న్యూయార్క్ ఫ్లైయిట్ నంబర్ ఓ త్రి టూ ఈజ్ రెడీ టు టేకాఫ్ ఫ్రమ్ నంబర్ సెవెన్ ఇన్ ఎ ఫ్యూ మినిట్స్. థాంక్ యూ."*

*లండన్‌లోని హీత్రో ఏర్‌పోర్ట్‌లోని స్పీకర్ లోంచి లేడీ ఎనౌన్సర్ కంఠం ఇంగ్లీషులో తియ్యగా వినిపించింది.*

*పేసెంజెర్స్ లాంజ్ లో కూర్చుని ది డెయిలీ టెలిగ్రాఫ్ దిన పత్రికని తిరగేస్తున్న భరద్వాజ ఓసారి తన చేతి గడియారం వంక చూసుకున్నాడు.*

*భరద్వాజ అరగంట నుంచి ఢిల్లీ నుంచి వచ్చే విమానం కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. ఆలోచనలు తులసి మీదకి, తన పెళ్ళికి ముందు రోజు జరిగిన సంఘటనల మీదకి మళ్ళాయి.*

*ఫల్గుణి అలాంటిదంటే ఇంకా ఆశ్చర్యంగా ఉంది. భరద్వాజకి తన సంగతి బైటపడిందని తెలియగానే మొహం చెల్లలేదు. ఆస్పత్రి నుంచి వెళ్ళిపోయింది.*

*పాపం చేయకూడదు. చేస్తే దాని ఫలితం ఈ జన్మలో అనుభవించాలి. ఫల్గుణి అనుభవిస్తోంది.*

*నవ్వొచ్చింది భరద్వాజకి.*

*తను అలా భావిస్తున్నాడు. కానీ ఫల్గుణి అలా అనుకోవడంలేదేమో? ఇంకెవరినయినా పెళ్ళి చేసుకుని హాయిగా జీవిస్తుంది. జరిగింది తన భర్తకి తెలియనంత కాలం అతన్ని మోసం చేస్తున్నట్లే లెక్క.*

*తెలిసిననాడు అతను సహించి భరిస్తే ఆ పాపం ఇంకో జన్మకి వాయిదా వేయబడచ్చు. లేదా సహించక వదిలేస్తే నిజమయిన నరకం అప్పుడు అనుభవిస్తుంది.*

*భర్తచేత వదిలివేయబడ్డ స్త్రీ జీవితం అన్ని విధాల నరకమే. కానీ చాలమంది అలా అనుకోరు. ఉద్యోగం చేస్తూ హాయిగా బతుకుతున్నాం అనుకుంటారు. కొంతమంది ఏ తప్పు వల్ల విసర్జింపబడ్డారో మళ్ళీ మళ్ళీ అదే తప్పు చేస్తూంటారు. కానీ ఉద్యోగం చేసేంత చదువులేని సాధారణ స్త్రీలు పుట్టింటికి చేరక తప్పదు. వారికి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండదు. కాబట్టి పెద్ద వాళ్ళ కట్టుదిట్టాల్లో ఉండాలి. అప్పుడే అసలయిన బాధ.*

భరద్వాజ ఆలోచనలని భంగపరుస్తూ మళ్ళీ లేడీ అనౌన్సర్ కంఠం ఇంగ్లీషులో ముందు, తర్వాత ఫ్రెంచ్ జర్మన్ భాషల్లో వినిపించింది.

"యువర్ ఎటెన్షన్ ప్లీజ్. ది ఢిల్లీ - లండన్ ఫ్లయిట్ నంబర్ 'సెవెన్ సిక్స్ ఓ' ఈజ్ ఎక్స్‌పెక్టెడ్ ఇన్ ఏ ఫ్యూ మినిట్స్ ఎట్ నంబర్ సెవన్."

భరద్వాజ లేచి గాజు తలుపుల వైపు నడిచాడు. దూరంగా గాలిలో ఎగురుతున్న విమానం వంక చూసాడు.

అది కొద్ది నిమిషాల తర్వాత రన్వే మీదికి దిగి కొద్దిగా దూరం వెళ్ళి మళ్ళీ వెనక్కి తిరిగింది.

'ఏర్ - ఇండియా' అని ఆ బోయింగ్ 732 - 200 మీద ఎనిమిది ఎర్ర అక్షరాలు ఇంగ్లీషులో రాసి ఉన్నాయి. 'మహారాజా' బొమ్మ విమానం ముందు పెయింట్ చేసి ఉంది.

ఒక్కొక్కరే లాడర్ మీంచి దిగి వస్తున్నారు. భరద్వాజ కళ్ళు తులసి కోసం చురుగ్గా చూస్తున్నాయి.

కనబడ్డది.

నీలం రంగు పట్టుచీర. నుదుటి మీద పావలా కాసంత ఎర్రటి బొట్టు. కళ్ళకి కాటుక. తల తిప్పుతూ ఆ కొత్త వాతావరణాన్ని, కొత్త మనుషులని వింతగా చూస్తోంది. ఆ కొత్తదనానికి అలవాటు పడక పోవడం వల్ల తులసికి భయంగా ఉంది.

'తులసిని నేను చేసుకుని ఉండకపోతే, ఇక్కడికి రాకపోతే, ఫల్గుణిని గురించిన ఆలోచనలు నన్ను తినేస్తూండేవి. తులసి ఆ స్థానంలోకి రావడం వల్ల ఆ వెలితి భర్తీ అయింది' అనుకున్నాడు భరద్వాజ.

విమానంలో తులసికి సహాయం చేసినావిడ కాబోలు, ఓ ఏభై పార్సీ ఆవిడ తులసితో ఏదో చెపుతూ టికెట్ చూపించమని సౌంజ్ఞ చేయడంతో, లాంజ్‌లోకి వచ్చే గేటు దగ్గర యూనిఫారంలో ఉన్నతనకి తులసి టికెట్ చూపించింది.

భరద్వాజకి తమాషా చేయాలనిపించింది. తులసి దగ్గరకి వెళ్ళాలనే కోరికని బలవంతంగా అణచుకుని తులసికి తను కనబడకుండా మొహానికి పేపర్ని అడ్డు పెట్టుకుని ఏం చేస్తుందా అని చూడసాగాడు.

ఏర్‌పోర్ట్‌లో రకరకాల మనుషులు హడావిడిగా తిరగడం చూస్తూ కాస్సేపు నిల్చుండి పోయింది. కాస్సేపు లైట్ల వంక, లాంజ్‌లోని పుస్తకాల షాపు వంక చూసింది. కాసేపు చుట్టూ చూసింది.

క్రమంగా తులసి మొహంలో భయం అధికం కావడం భరద్వాజ గమనించాడు. ఇంకాసేపు ఆగాలనుకున్నాడు కానీ తులసి గట్టిగా ఏడవడంతో దగ్గరకి పరుగెత్తుకెళ్ళాడు.

"దేనికీ?" లాలనగా అడిగాడు.

"వచ్చారా? రాలేదని" తులసి కళ్ళు తుడుచుకుని సంతోషంగా చెప్పింది.

లాంజ్‌లోని కొంతమంది తమవైపు కొద్దిగా ఆసక్తిగా చూడటం గమనించి భరద్వాజ సిగ్గుపడ్డాడు.

ఏర్ పోర్టులోంచి బయటపడ్డారు. యాంత్రికంగా వాటంతటవే తెరుచుకునే అద్దాల తలుపులు. విశాలమయిన లాంజ్. రకరకాల దుస్తుల్లో, రకరకాల దేశాలకి చెందిన ప్రయాణీకులు. వాళ్ళు మాట్లాడే అనేక రకాల భాషలు. తులసికి ఆ ప్రపంచం ఎంతో కొత్తగా, వింతగా ఉంది.

ఒక చేత్తో సూట్ కేస్‌ని, ఒక చేత్తో తులసి చేతిని పట్టుకుని భరద్వాజ బయట పార్కింగ్ ప్లేస్‌లో ఆగి ఉన్న కారు వైపు దారి తీసాడు.

మార్చ్ నెల కావడం వల్ల వాతావరణం ఆహ్లాదంగా ఉంది. చలి కాలం పూర్తయి వేసవి కాలం మొదలవుతోంది. తులసిని ముందర తన పక్క సీట్లో కూర్చోపెట్టి తర్వాత స్టీరింగ్ వీల్ ముందు కూర్చుని కారు స్టార్టు చేసాడు.

"అటు చూడు."

తులసి భర్త సూచించిన వైపు చూసింది. వెంటనే సిగ్గుతో రెండు చేతులూ మొహానికి అడ్డుగా పెట్టుకుంది.

కారులోని భార్యాభర్తలో, ప్రేమికులో కానీ ఒకర్ని మరొకరు ముద్దు పెట్టుకుంటున్నారు. వాళ్ళలో ఒకరు మరొకరికి బహుశా వీడ్కోలు చెప్పడానికి వచ్చినట్లున్నారు.

"ఛీ, పాడు."

భరద్వాజ మందహాసం చేసాడు.

తులసి కారు కిటికీలోంచి బయటికి విశాలమయిన రోడ్లని, ఎడతెరిపి లేకుండా తిరిగే కార్లని, ట్రాఫిక్ లైట్లని, షాప్స్‌కి ఉండే పెద్ద పెద్ద డిస్‌ప్లే విండోలలోని వస్తువులని, ఆరి వెలిగే రంగు రంగుల నియాన్ ఎడ్వర్‌టైజ్ మెంటు లైట్లని, ఎర్రటి లండన్ డబల్ డెక్కర్ బస్సులని చూస్తూండిపోయింది.

దాదాపు అరగంట తర్వాత న్యూ ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్ లోంచి కారుని ఛేరింగ్ క్రాస్ స్ట్రీటులోకి మళ్ళించాడు. పక్కనే ఉన్న చిన్న చిన్న సందుల్లోని ఓ సందులోకి పోనించి తన ఫ్లాటు కోసం కేటాయింపబడ్డ పార్కింగ్ ప్లేస్‌లో కారుని ఆపాడు.

కారు దిగి, కారు తలుపు తెరిచి సూట్ కేస్ అందుకుని తులసితోచెప్పాడు.

"పద. వచ్చేసాం. అదే మన ఇల్లు."

అక్కడ కట్టబడ్డ ఇళ్ళు తీరు తులసికి చాలా గమ్మత్తుగా అనిపించింది. వాటిని చూస్తూ భరద్వాజ వెనకే ఉత్సాహంగా నడిచింది. మేడ మెట్లెక్కి ఫస్ట్ ఫ్లోర్ లోని అపార్ట్‌మెంట్ తలుపుని తాళం చెవితో తెరిచాడు.

"ఇదే మన ఇల్లు."

తులసి లోపలికి రాగానే తలుపు మూసి సూట్ కేసుని టేబులు మీద ఉంచాడు.

చిన్న అపార్ట్‌మెంట్ అది. ముందు గది, ముందు గదిలోంచి లోపలికి చిన్న పాసేజ్, పాసేజ్‌కి ఎడం వైపు తలుపు తీస్తే చిన్న బాత్ రూం కమ్ టాయిలెట్. పాసేజ్ దాటి లోపలికి వెళితే ఓపెన్ కిచెన్, బెడ్ రూం.

"ఎలా ఉంది?" అడిగాడు.

"చిన్నదయినా బాగుంది."

"ఇది గేస్‌స్టవ్. హైదరాబాద్‌లోలా ఇక్కడ సిలిండర్స్ అవసరం లేదు. అక్కడ మనింటికి నీళ్ళు ఎలా పైపు ద్వారా వస్తాయో ఇక్కడ అలాగే గేస్ వస్తుంది. మీటర్ ఎంత ఖర్చయిందో చూపిస్తుంది. నెలకోసారి బిల్ వస్తుంది"

తులసి వాటిని సంభ్రమంగా చుస్తోంది.

"ఇది సింక్, ఇది ఫ్రిజ్, ఇది డిష్ వాషర్. గిన్నెలు దీంట్లో వేసి ఆన్ చేస్తే ఆటోమేటిక్‌గా వాటంతట అవే వాష్ అవుతాయి."

భరద్వాజ వంటగదిలోని సరంజామాని పరిచయం చేసాడు. తులసికి అంతా విచిత్రంగా ఉంది.

"చుట్టుపక్కల తెలుగు మాట్లాడేవాళ్ళు లేరా?" తులసి అడిగింది.

"లేరు. కొద్ది దూరంలో 'సింగ్' అని ఒకతను ఉన్నాడు. అతనొక్కడే మన దేశస్థుడు తెలుగు రాదు."

తులసి మొహంలో కనిపించిన అసంతృప్తిని గుర్తించి భరద్వాజ నవ్వి చెప్పాడు.

"తెలుగువాళ్ళు చాలా మందే ఉన్నారు. ఆదివారాలు కలుసుకోవచ్చు. రోజూ కుదరదు."

"ఇక్కడే అయిదు సంవత్సరాలు ఉండాలా?"

"అప్పుడే విసుగు పుట్టిందా? వచ్చి అరగంట కూడా కాలేదు?" భరద్వాజ నవ్వాడు.

తులసి కంఠంలో బాధ, కళ్ళలో తడి గుర్తించి దగ్గరకు లాక్కుని మృదువుగా చెప్పాడు.

"అలవాటైపోతుంది. అయిదు సంవత్సరాల తర్వాత ఇక్కడ నుంచి వెళ్ళాలంటేనే బాధ వేస్తుంది. నీకు ఎప్పుడైనా మీ వాళ్ళని చూడాలనిపిస్తే నాతో చెప్పు. కూడా నే రాలేకపోయినా నిన్ను పంపిస్తాను. ఏం?"

తులసి కళ్ళు మూసుకుంది. కనురెప్పల కింద నుంచి కన్నీరు బుగ్గల మీదకి జరజరా కారింది.

"సిల్లీ. చిన్న పిల్లలా ఏడుపా?"

అరగంట తర్వాత తులసి స్నానం అయ్యాక చెప్పాడు.

"ఈ పూటకి బయట భోజనం చేద్దాం. రేపటి నుంచి ఇంట్లో వంట చేసుకోవచ్చు."

"మన భోజనం దొరుకుతుందా?"

"ఇడ్లీలతో సహా అన్నీ దొరుకుతాయి. కానీ ఖరీదెక్కువ. ఎప్పుడైనా సరదాగా వెళ్ళాలంటే, వీరాస్వామీస్ అని మద్రాస్ వాళ్ళ హోటల్ ఉంది. వాళ్ళ దగ్గర అన్నం సరిగ్గా ఉడకబెట్టరు."

ఇద్దరూ మళ్ళీ కారులో బయలుదేరారు. పదిహేను నిముషల తర్వాత ఓ పార్కింగ్ మీటర్ లో సిక్స్ పెన్స్ నాణెం వేసి భరద్వాజ కారుని పార్క్ చేసాడు.

"గంటదాకా మన కారు ఇక్కడ పార్క్ చేసి ఉండచ్చు. తర్వాత ట్రాఫిక్ పోలీస్ కంటపడితే ఫైన్ వేస్తాడు. గంటలో భోజనం ముగించుకుని వెళ్ళాలి."

"గంట దాటితే ఎందుకు ఫైన్?" అడిగింది తులసి.

"లండన్ లో కార్లు ఎక్కువ. వాటిని పార్కు చేసే చోటు తక్కువ. కాబట్టి కారు పార్కు చేయడం అనేది పెద్ద సమస్య. ఎక్కడ పడితే అక్కడ రోడ్లమీద మన ఊళ్ళోలా పార్కు చేయకూడదు. అక్కడక్కడా పార్కింగ్ ప్లేసెస్ ఉంటాయి. ఆ చోట్లలోనే ఆ మీటర్ల ద్వారా రుసుము కట్టి కార్లని పార్కు చేయాలి. కార్లు ఎక్కువకావడంతో పార్క్ చేసేందుకు చోటు లేక ఒకోసారి పార్క్ చేసిన చోటునుంచి అరగంట దూరం కూడా నడిచి వెళ్తూంటారు."

"అన్ని కార్లే?" తులసి ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. అంతేకాదు. ఇక్కడ అన్నీ సిస్టమేటిక్‌గా, టైమ్ ప్రకారం జరిగిపోవాలి. టైమ్ ముఖ్యం. డబ్బు ప్రధానం కాదు. కొద్దికాలం ఆగితే నీకే ఈ కొత్త ప్రపంచం గురించి అంతా తెలుస్తుంది."

ఇద్దరూ రెస్టారెంట్‌కి చేరుకున్నారు.

దారిలో చాలామంది బ్రిటిష్ దేశస్తులు తులసి వంక, తులసి కట్టుకున్న చీర వంక, నుదుట బొట్టు వంక, జడవంక, కాళ్ళకున్న మెట్టెల వంక వింతగా చూడసాగారు.

వాళ్ళ చూపులు కొద్దిగా ఇబ్బందిగా అనిపించి తులసి, చికాకుగా అడిగింది.

"ఎందుకలా చూస్తారు?"

"చూడటమే కాదు. దగ్గరకు వచ్చి వాటిని గురించి అడుగుతారు కూడా. ఇక్కడి వాళ్ళకి మన కట్టుబొట్టు కొత్తకదా? కాని ఏం చేయరు. భయపడకు."

"వాళ్ళ గౌన్లు, బెల్ బాటమ్ పాంట్లు చూడ్డానికే ఎబ్బెట్టుగా ఉన్నాయి." పెదవి విరిచింది.

"మన చీరలకి అలవాటు పడ్డ వాళ్ళకి ఇంకేది నచ్చదు. ముఖ్యంగా చీరలోని కంఫర్ట్ ఇంక దేంట్లోనూ ఉండదు."

భరద్వాజ హిందీలో మెనూ ఆర్డరు చేసాడు.

" ఈ రెస్టారెంట్ తమిళియన్స్ది. లండన్ లోని సౌత్ ఇండియన్ హోటల్స్‌లో ఇది ఒకటి. రోజూ ఇక్కడే నా భోజనం."

ఓ పింగాణీ ప్లేటులో ఉడక బెట్టిన బంగాళాదుంపలు, మరో దాంట్లో అన్నం, ఇంకో దాంట్లో ఉడకబెట్టిన బఠాణీలు తెచ్చి బేరర్ వాటిని టేబుల్ మీద సర్దాడు.

వాడు వెళ్ళిపోయాక తులసి వాటిని స్పూన్‌తో రుచి చూసి మొహం అదోలా పెట్టి అడిగింది.

"ఇదేనా మీరు రోజూ తినేది."

"అవును."

చిన్నగా నిట్టూర్చి చెప్పింది.

"రేపటి నుంచి ఇంటిదగ్గరే వంట చేసుకుందాం. అన్నం ఉడకలేదు. కూరల్లో కారంలేదు."

తులసికి కడుపు నిండలేదు.

"పెరుగు కానీ, మజ్జిగ కానీ దొరకదా?" నిస్పృహాయంగా అడిగింది.

"ఉహు. రాత్రిపూట దొరకదు."

"ఆవకాయ, మాగాయ తక్కువ తీసుకొచ్చాను. ఇంకాస్త ఎక్కువ తీసుకు రమ్మని రాయాల్సింది మీరు."

"బరువు ఎక్కువ కాకూడదుగా. అప్పడాలు, వడియాలు, పచ్చళ్ళు, ఊరగాయలు దొరుకుతాయి. నువ్వు తెచ్చింది అయిపోగానే కొనుక్కుందాం."

తులసి, భరద్వాజ భోజనం ముగించి పార్కింగ్ చోటికి త్వర త్వరగా చేరుకున్నారు.

ఆ రాత్రి తులసి చాలాసేపు నిద్రపోలేదు. రాత్రి రెండుదాకా భరద్వాజ తులసిని నిద్రపోనియ్యలేదు.

**(వచ్చే నెల - కొత్తశత్రువు)**

**కృతజ్ఞతలు**

'ఇంకా ఉంది' మొదలు పెట్టాక నా నవలల సేకరణ నుంచి న పాత నవలలు నాలుగు మిస్ అయ్యాయని గ్రహించాను. వాటిని ఎవరికీ ఇవ్వలేదు. ఇంటికి వచ్చిన ఎవరు తీసుకెళ్ళారో తెలీదు. వాటిని తిరిగి సంపాదించే ప్రయత్నంలో శ్రీమతి శ్యామల గౌరి (బెంగుళూర్) అనే అభిమాని కొత్త శత్రువు నవలని స్కేన్ చేసి పంపినందుకు వారికి కృతజ్ఞతలు.కానీ కవర్ పేజీ చిరిగిపోవడంతో దాన్ని ఇవ్వలేకపోతున్నాను.

శ్రీ వెనిగళ్ళ రామ్మోహన్ రావ్ (హైదరాబాద్) చాలాకాలంగా తెలుగు నవలలని వివిధ ప్రచురణకర్తల నుంచి తీసుకుని నగరంలో డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. సాహిత్యాభిమాని అయిన వారు రకానికి ఒకో కాపీని అమ్మకుండా దాస్తున్నారు. కవర్‌పేజీ గల కొత్త శత్రువు, యమాయనమః, కవర్ పేజీ లేని నాతిచరామి, ది లవ్ జెర్క్ నవలలని ఇచ్చినందుకు వారికి కూడా నేను కృతజ్ఞుణ్ణి. ఎవరి దగ్గరైనా ది లవ్ జెర్క్, నాతిచరామి, అద్దెకిచ్చిన హృదయాలు ఎమెస్కో ప్రచురణ) కవర్ పేజీలు ఉంటే దయచేసి స్కేన్ చేసి నాకు పంపగలరా? tamaswini@gmail.com

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి



Click here to share your comments on this story